బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-కడెం



ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. ఆదివారం మధ్యాహ్నం క మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన సుమారు 50 మంది సర్పంచ్ కొప్పుల లక్ష్మీ లచ్చన్న ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామాధ్యక్షులు భైరి రవి, మాజీ గ్రామాధ్యక్షులు మిల్యారి సత్తన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్



ప్రమాదాల నివారణకు వాహనదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్ సూచించారు. ఆదివారం ఘన్‌పూర్ పంచాయతీ పరిధిలోని ఘన్‌పూర్ నుంచి పలు గ్రామాలకు వెళ్లే రోడ్డుకు ఇరు వైపుల పెరిగిన పిచ్చి మొక్కలతో పిచ్చి గడ్డిని తొలగించారు. తొలగింపును ఎంపీపీ దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడికైనా రోడ్డు వెంబడి వెళు తున్న వాహనదారులు మూలమాలుపు వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎవరికి ఇబ్బంది కలగకుండా వెళ్లాలని కోరారు. ఆయన వెంట నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

లంచావతారులు..!

- అక్రమార్జనకు అలవాటు పడుతున్న కొందరు అధికారులు
- డబ్బులిస్తే పరిష్కారం..లేదంటే బాధితులకు తిప్పలే
- కొందరు అవినీతి అధికారుల వైఖరితో ప్రజల సతమతం
- ధరణిలో లోపాలు..రైతులకు శాపాలుగా మారుతున్న వైనం
- తాజాగా ఏసీబీ వలకు చిక్కిన తహసీల్దార్, ఆర్ఐ

ప్రతి పనికి లంచం తీసుకోవడమనేది కొందరు అధికారులకు అలవాటుగా మారింది. ఏ చిన్న పని చేయాలన్నా ఎంతో కొంత ముట్టజెపితే కానీ పని జరిగని పరిస్థితి కనిపిస్తోంది. కొందరు అధికారుల ధనదాహం కారణంగా అమాయక జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీర్ఘకాలికంగా ఆయా సమస్యలు పరిష్కారం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. రెవెన్యూతో పాటు వివిధ శాఖల్లోనూ కొందరు అధికారులు, సిబ్బంది అక్రమార్జనకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. బాధితులు ఎంతో కొంత ముట్టజెబితే కానీ సులువుగా పనులు జరగడం లేదనే ఆరోపణలున్నాయి. తాజాగా పట్టాపాసు పుస్తకంలో తప్పులు సరిచేయడం కోసం ఓ వ్యక్తి నుంచి రెవెన్యూ అధికారులు లంచం తీసుకోవడం కలకలం రేపింది. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఆదివారం మావల తహసీల్దార్ ఆరిఫాసుల్తానా, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ హనుమంతరావును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం చర్చనీయాంశమైంది. వీరితో పాటు ఇదే ఏడాది జనవరిలో మరో ముగ్గురు అధికారులు ఏసీబీకి పట్టుబడటం జిల్లాలో చర్చకు దారితీస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ టౌన్

కొందరు ప్రభుత్వ అధికారుల అవినీతి, అక్రమాలు మితిమీరిపోతున్నాయి. ఏ చిన్న పని చేయాలన్నా ఎంతో కొంత ముట్టజెప్పాలనే విధంగా వ్యవహరిస్తున్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే బాధితులను ముప్పుతిప్పలు పెట్టడం సాధారణంగా మారుతోంది. రోజుల తరబడి ఆయా కార్యాలయాల వెంట ప్రదక్షిణలు చేస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఆదిలాబాద్ జిల్లాలో మూడేండ్ల వ్యవధిలోనే పలువురు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటం ఈ ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తోంది. మూడేండ్ల క్రితం విద్యుత్‌శాఖలో ఇద్దరు ఏఈలతో పాటు ఒక లైన్‌మెన్ ఏసీబీకి చిక్కిన ఉదంతం మరువక ముందే 2020 ఏడాదిలో ఓ గుత్తేదారు నుంచి ఓ గణాంక అధికారి లంచం తీసుకోవడం అప్పట్లో చర్చనీయాంశమైంది. మరోపక్క ఇదే ఏడాది జనవరిలో ఓ పొరుగు సేవల గుత్తేదారు నుంచి జిల్లా ఉపాధి కల్పన అధికారితో పాటు అదేశాఖలో పనిచేసే సూపరింటెండెంట్, రిమ్స్‌లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఈ పరిణామం



మరువకముందే తాజాగా మావల తహసీల్దార్ ఆరిఫా సుల్తాన, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ హనుమంతరావు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన బాధితుడు యతీంద్రనాథ్ అనే వ్యక్తి నుంచి రూ.2లక్షలు లంచం తీసుకుంటూ ఆదివారం ఏసీబీకి పట్టుబడటం సంచలనంగా మారింది. బాధితుడు పట్టాపాసు పుస్తకంలో దొర్లిన తప్పులను సరిచేయాలని అధికారులకు దరఖాస్తు చేయగా.. ఈ సమస్య పరిష్కారం కావాలంటే రూ.2లక్షలు ఖర్చు అవుతుందని అధికారులు డిమాండ్ చేయడంతో బాధితుడు నేరుగా ఏసీబీని



ఆశ్రయించినట్లు అవినీతి నిరోధకశాఖ అధికారులు చెబుతున్నారు.

ధరణిలో లోపాలూ కారణమే..?

భూ సమస్యల పరిష్కారం ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ కూడా రైతుల సమస్యలకు కారణమవుతోందనే వాదన వినిపిస్తోంది. ఇందులో తలెత్తిన లోపాలు కొందరు అధికారులకు వరంలా మారుతుండగా ..రైతులకు మాత్రం శాపంగా మారుతున్నాయనే విమర్శలున్నాయి. పేరు మార్పిడి, భూములు ప్రస్తుతం సాగు చేస్తున్నప్పటికీ అవి నిషేధిత జాబితాలో ఉండటం.. అమ్మకం..కొనుగోలు చేయడం సాధ్యం కాకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో వాటిని సరిచేసుకునేందుకు సంబంధిత రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వీటితో పాటు భూమి ఎక్కువగా ఉంటే పాస్‌బుక్‌లో తక్కువగా నమోదు కావడం.. భూమి రకం తప్పుగా పడటం వంటి సమస్యలు రైతులను వేధిస్తున్నాయి. ఆయా సమస్యలను పరిష్కరించుకునేందుకు రైతులు రోజుల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలోనే అవినీతి అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కొన్ని శాఖల్లో కొందరు అధికారులు డబ్బులివ్వనిదే త్వరగా పనిచేయరనే ప్రచారం జరుగుతోంది. మరికొందరు అధికారులు ఆయా పనులు, బిల్లుల మంజూరు కోసం గుత్తేదారుల నుంచి కమిషన్ రూపంలో తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. మరోపక్క కొందరు అధికారులు వారి శాఖల పరిధిలో నిజాయతీగా పనిచేస్తూ ప్రజలతో పాటు ఉన్నతాధికారుల ప్రసంశలు పొందుతుంటే..మరికొందరు మాత్రం లంచాలకు అలవాటు పడి ప్రజలను పట్టిపీడిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో జిల్లాకు బంగారు పతకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాలికల రెజ్లింగ్ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారిని బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈనెల 23 నుంచి మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూర్‌లో ప్రారంభమైన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో 56 కేజీల వెయిట్ కేటగిరిలో అంకోలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వైష్ణవి, ఫ్రీ స్టయిల్ విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకుందని కోచ్ జి.నాందేవ్ తెలిపారు. జిల్లాకు పతకం రావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు, డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, పెటా సంఘం అధ్యక్ష,కార్యదర్శులు పార్థసారథి, స్వామి క్రీడాకారిణిని అభినందించారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శం



నవతెలంగాణ-తలమడుగు

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఖోడద్ గ్రామంలో గడపగడపకు అనిల్ జాదవ్ కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యాటించారు. మొదటగా డాక్టర్ భారతరత్న బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజరెడ్డి, గ్రామసర్పంచ్ ఆనంద్, కళ్లెం కరుణాకర్‌రెడ్డి, కేదారేశ్వర్‌రెడ్డి, జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు తోట వెంకటేష్, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, తాంసి వైస్ ఎంపీపీ ముచ్చ రేఖారఘు, స్థానిక నాయకులు లక్ష్మారెడ్డి, ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి, అబ్దుల్లా, మల్కు, నర్సిములు, నారాయణరెడ్డి, దేవేందర్‌రెడ్డి, పాండురంగ, సుదర్శన్‌రెడ్డి, వంశీరెడ్డి, అభిరాంరెడ్డి, సతీష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదంలో శ్మశాన వాటిక స్థలం



నవతెలంగాణ-సిరికొండ

ఎన్నో ఎండ్ల నుంచి దహన సంస్కారాలు నిర్వహిస్తున్న శ్మశాన వాటిక స్థలం వివాదంలో ఉంది. అధికారులకు విన్నవించిన ఎలాంటి స్పందన రాకపోవడంతో గ్రామస్తులు స్థలం చుట్టూ ఆదివారం కంచే వేశారు. శు క్రవారం గ్రామానికి చెందిన అరుణ్ అనే వ్యక్తి అంత్యక్రియలను నిర్వహించడానికి వెళ్లారు. అయితే ఆ స్థలం తమదేనని, పూర్తి హక్కులున్నాయని ఎదుటివారు ఆందోళన చేశారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఆదివారం ఆ స్థలం వద్దకి వెళ్లి కంచెను వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఓరగంటి పెంటన్న, బాలాజీ, అశోక్, గంగాధర్, మల్లేష్, దత్తు, స్వామి, ప్రభాకర్, మల్లారెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

ఇటీవల స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2023లో ఉత్తమ గ్రామపంచాయతీగా అవార్డు అందుకున్న నర్సాపూర్(జి) సర్పంచ్ ఏ.రామ్‌రెడ్డి, ఉత్తమ ఎంపీఓగా అవార్డు గంగా సాగర్‌రెడ్డిలు అవార్డులు పొందారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో 1991 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ మిత్రబృందం తమ స్నేహితులకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగారెడ్డి, అల్లాడి రవికుమార్, బి.గంగారాం, పి.రాజేశ్వర్‌రెడ్డి, జీవన్‌రావు, సంటెన్న, శంకర్, ప్రభాకర్, రామచందర్, బొల్లి రవి, రాజన్న పాల్గొన్నారు.

తాయిళాలు పంచి ఓట్లు రాబట్టడం హాస్యాస్పదం

- ఎమ్మెల్యే జోగు రామన్న
- బంగారుగూడ వాసులకు ఇంటి నెంబర్ల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఎన్నికల సమయంలో తాయిళాలు పంచి ఓట్లు రాబట్టడానికి కొందరు ప్రతిపక్ష నాయకులు ప్రయత్నించడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని బంగారుగూడ పరిధిలో నివసిస్తున్న వారికి ఇంటినెంబర్ల పంపిణీ కార్యక్రమాన్ని ఓ ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు. దాదాపు 1485 ఇండ్లకు ఇంటి నెంబర్లను కేటాయించారు. వాటికి సంబంధించిన పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గత తొమ్మిదేండ్లుగా ప్రజలకు కనీస వసతులను కల్పించడానికి, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చించి, ప్రజల ఇక్కట్లను దూరం చేస్తోందని అన్నారు. బంగారుగూడలో నివాసం ఉంటున్న ప్రజలు ఏండ్ల నాటి ఇబ్బందులను పరిష్కరించడానికి ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. అందుకు అనుగుణంగానే ప్రభుత్వ నియమాల ప్రకారం ఇంటినెంబర్ల కేటాయింపు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజాహితం కోసం అనునిత్యం పాటుపడుతున్నామని స్పష్టం చేశారు. గతంలో



పాలించిన కాంగ్రెస్ హయంలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సైతం ప్రజా సంక్షేమానికి చేసింది శూన్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కమీషనర్ శైలజ, రైతుబంధు సమితి అధ్యక్షులు రోకండ్ల రమేష్, ఫ్లోర్‌లీడర్ బండారి సతీష్, అశ్రఫ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, సాజిదోద్దీన్, సలీమ్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసువాలని ఐటీడీఏ పీవీటీజీ ఏపీఓ భాస్కర్ అన్నారు. యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని లక్కారంలోని రాంజీ గోండు భవన్‌లో నిర్వహించిన ఐటీడీఏ పథకాల అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనులను అన్నింటిలో ఆర్థికాభివృద్ధి సాదించేందుకు ఐటీడీఏ ఎన్నో పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. పథకాలన్ని సరియైన తీరులో ఉపయోగించుకుంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దాన్ ఫౌండేషన్ చైర్మెన్ కుంర విఠల్, యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు తిరుపతి, నరేష్, కేశవ్, లక్ష్మణ్, హుస్సేన్‌రావు ఉన్నారు.

వృద్ధురాలికి రేషన్ బియ్యం పంపిణీ



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి చెందిన తులసిబాయి వృద్ధ మహిళకు గత 18 నెలల నుంచి ఫింగర్, ఐరిస్ పడక ప్రభుత్వ రేషన్ సరుకులు అందడం లేదు. విషయం తెలుసుకున్న వార్డు సభ్యులు, ప్రాజెక్టు స్మైల్ సొసైటి అధ్యక్షుడు షాకీర్ బియ్యం అందించారు. తనతో పాటు దాతల సహకారంతో 60 కిలోల బియ్యం పంపిణీ చేసి ధైర్యం చెప్పారు. ఐరిస్ వేలిముద్రలు పడని వారికి ప్రభుత్వ అధికార యంత్రాంగం చొరవ తీసుకొని రేషన్ సరుకులు అందేవిధంగా చూడాలని షాకీర్ కోరారు. సొసైటీ తరఫున పేదలను ఆదుకునేలా కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు ఎస్.స్వామి, సభ్యులు పర్వేజ్, రాయల తిరుపతి, జోనేద్, సోలంకి సాయికిరణ్ పాల్గొన్నారు.

రేపు ఖోఖో బాలుర జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 26న ఉట్నూరులోని కేబీ కాంప్లెక్స్ ఆవరణలో 14 సంవత్సరాల విభాగం జిల్లాస్థాయి బాలుర ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన క్రీడాకారులు సంబంధిత వయసు ధృవీకరణ పత్రంతో హాజరు కావాలని తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున బాలురు హాజరయ్యేలా చూడాలని వ్యాయామ ఉపాధ్యాయులను ఆయన కోరారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 10 గంటలకు కేబీ కాంప్లెక్స్‌లో రిపోర్ట్ చేయాలని సూచించారు.

26న బాలుర జిల్లాస్థాయి హాకీ జట్ల ఎంపిక...

పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 26న ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్ ఆవరణలో అండర్-14, 17 బాలుర జిల్లాస్థాయి హాకీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కాంతారావు తెలిపారు. అర్హులైన క్రీడాకారులు సంబంధిత వయసు ధృవీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు కేబీ కాంప్లెక్స్‌లో రిపోర్టు చేయాలని సూచించారు.

స్మైల్ సొసైటీ చేయూతతో నిస్సహాయులకు మేలు

- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, వీటితో పేదలు, నిస్సహయులకు మేలు జరుగుతుందని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. ఆదివారం స్మైల్ సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ జన్మదినాన్ని పురస్కరించుకుని రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాదాపు 30 మంది యువకులు రక్తదానం చేయగా వారిని రిమ్స్ డైరెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం రోగి సహాయకులకు అన్నదానం చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు సురేష్, మహమ్మద్ రఫీ, సాయిగౌడ్, కిరణ్, విశాల్, రామకృష్ణ, రునేష్, రాహుల్ పాల్గొన్నారు.

బాసరలో ఏపీ కార్మిక శాఖ మంత్రి పూజలు

నవతెలంగాణ-బాసర

సరస్వతిదేవి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆదివారం ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు మంగళ వాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో కార్మిక శాఖ మంత్రి మనవడికి ప్రత్యేక అక్షరాభస పూజను ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, ప్రధానార్చకులు సంజీవ్ వేదమంత్రాల మధ్య జరిపించారు. ఆలయ విశిష్టత అమ్మవారి చరిత్రను మంత్రికి ఆలయ అర్చకులు వివరించారు. మంత్రికి పట్టు వస్త్రాలతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఆలయ అధికారులు, ఎస్సై గణేష్ పాల్గొన్నారు.

గిరిజనేతరులకు సమాన హక్కులు కల్పించాలి



నవతెలంగాణ-నార్నూర్

ఏజెన్సీ మండలాల్లో తరతరాలుగా నివసిస్తున్న ఎస్సీ, బీసీ, మైనార్టీ గిరిజనేతరులకు గిరిజనులతో పాటు సమాన హక్కులు కల్పించాలని షెడ్యూల్ ఐక్య కులాల రాష్ట్ర నాయకులు భారత్ వాగ్మారే డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతువేదికలో గిరిజనేతరుల సమాజ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా ఏజెన్సీ గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనేతరులు అన్ని రకాల అభివృద్ధిలో దూరంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం సమాన హక్కులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ సమాజ కులాల నాయకులు, యూనుస్ అక్బానీ, నర్సింగ్ మోరే, కాంబ్లే ఉద్ధవ్, న్యానోబా పుష్కర్, స్థానిక సర్పంచ్ గజానంద్ నాయక్, ఆడే సురేష్, కనక ప్రభాకర్, దుర్గే కాంతారావ్ పాల్గొన్నారు.

27న జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్-17 బాలికల జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు తెలిపారు. అర్హులైన క్రీడాకారులు సంబంధిత వయసు ధృవీకరణ పత్రంతో ఉదయం 10 గంటలకు పోటీల ఆర్గనైజర్ కె.రేణుకకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | సెప్టెంబర్ 25, 2023 | www.navatelangana.com

కోఆప్షన్ సభ్యుడిని పరామర్శించిన నాయకులు

నవతెలంగాణ-బోథ్



మండలంలోని సొనాల గ్రామానికి చెందిన కోఆప్షన్ సభ్యుడు మహిమూద్ ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. దీంతో ఆయన చేయి విరిగింది. ఆదివారం ఏఎంసీ డైరెక్టర్ అమృత్‌రావు పాటిల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు మునీశ్వర్ సోమన్న, నాయకులు భీమ్‌రావు పాటిల్, బీఆర్ఎస్ నాయకులు సంఘపాల్, అశన్న, శ్రీనివాస్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని త్వరగా కొలుకోవాలని అన్నారు.

గ్రూప్-1 అభ్యర్థులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1 అభ్యర్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మెస్రం భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తున్న ప్రభుత్వం వాటిని పకడ్బందీగా నిర్వహించలేకపోయిన టీఎస్‌పీఎస్సీ బోర్డ్‌ను ప్రక్షాళన చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని అన్నారు. గ్రూప్-1 అభ్యర్థులకు రూ.5 లక్షల నష్ట పరిహారాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పనితీరు నేడు నిరుద్యోగులను అంధకారంలోకి నెట్టివేసేలా మారిందన్నారు. నిరుద్యోగులు ఎన్నో ఏండ్లుగా ఎదురుచూసినా గ్రూప్-1 పరీక్ష కోసం కష్టపడి చదివితే లీకేజీ కారణంగా నష్టపోయారన్నారు.

బతుకమ్మ ఆడుతూ అంగన్‌వాడీల నిరసన

నవతెలంగాణ-సిరికొండ

బతుకమ్మ ఆడుతూ అంగన్‌వాడీలు ఆదివారం నిరసన తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు నిరసనలు ఇలాగే కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సారంగాపూర్ : అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని బీజేపీ నాయకులు సాయాబ్ రావు, సామల వీరయ్య అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, ఆయలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, రూ 26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, నారాయణ నాయక్, దిలీప్, లింగారెడ్డి ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

బాసర : న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తలపెట్టిన సమ్మె ఆదివారంతో 14 రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల చీరలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించే వరకు నిరసన కొనసాగిస్తామని సీఐటీయూ మండల అధ్యక్షురాలు అంగన్‌వాడీ టీచర్ రజియా అన్నారు. రూ.26వేల వేతనం, ఇతర డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు అరుణ, లక్ష్మి, ప్రేమలత, సరోజ, సాయవ్వ, సునీత పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలకేంద్రంలో అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటి 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేసి, క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఉచిత ఆరోగ్య బీమా కల్పించి ఆదుకోవాలని అన్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా గొడుగులు పట్టుకొని కూర్చొని నిరసన తెలిపారు. నల్ల చీరలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి లలిత, మండల అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, కార్యదర్శి భాగ్యలక్ష్మి, విజయ, వరలక్ష్మి, పద్మ, కె.సునీత, రాజమణి, సుజాత, మండల అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



సిరికొండ

ఆదిలాబాద్‌టౌన్ : అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో భాగంగా ఆదివారం వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గత 14 రోజులుగా అంగన్‌వాడీలు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె కొనసాగుతుంది. సమ్మెలో భాగంగా ఉద్యోగులు సమ్మె శిబిరం వద్ద వంటావార్పు చేపట్టి అక్కడే భోజనాలు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం, జేఏసీ నాయకత్వంతో చర్చలు జరపకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. వెంటనే ప్రభుత్వం జేఏసీ నాయకత్వంతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చొరవచూపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



సారంగపూర్



లక్ష్మణచాంద



ఆదిలాబాద్‌టౌన్

ఈసారైనా ఆదరించి గెలిపించాలి



నవతెలంగాణ-తాంసి

ఈసారైనా ఆదరించి గెలిపించి అసెంబ్లీకి పంపించే బాధ్యత మీదేనని బోథ్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం పొన్నారి, కప్పర్ల, పాలోడి, జామిడి, గ్రామాల్లో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డితో పాటు వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులతో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లోని వినాయక మండపాలలోని వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన, ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పటికీ ఓటమిపాలు అయినప్పటికీ కుంగిపోకుండా ప్రజల మధ్యనే ఉన్నానని అన్నారు. ఈ సారి సీఎం కేసీఆర్ బోథ్ నియోజకవర్గం ప్రజలపై నమ్మకంతో ఈసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించడం జరిగింది. ఈసారి నియోజకవర్గ ప్రజలు తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన ప్రజలు నన్ను ఆదరించి గెలిపించి అసెంబ్లీకి పంపుతారని ఎంతో నమ్మకం ఉందన్నారు. ఏ గ్రామానికి వెళ్లిన పార్టీలకు అతీతంగా ఆదరిస్తున్నారు. మీరు నాపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి గ్రామాన్ని సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో అన్ని విధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌లు సదానందం, కేశవ్ రెడ్డి, శంకర్, కన్వీనర్ అరుణ్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, అనిల్, మహేందర్, అశోక్, నారాయణ, కృష్ణ, లస్మన్న, ఆశన్న, రజినీకాంత్‌రెడ్డి, దేవిదాస్, రఘు, వెంకన్న వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం లభించే వరకు పోరాడుతాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహాత్మ జ్యోతిరావు పూలే దంపతుల సాక్షిగా మాలీలకు సామాజిక న్యాయం లభించేంత వరకు పోరాటం చేస్తామని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పూలే విశ్రాంతి భవనంలో సత్యశోధక సమాజ స్థాపన 150వ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం కార్యక్రమానికి వచ్చిన వారందరికీ తెలుగు, మరాఠి, హిందీ భాషల్లో పూలే సాహిత్యాన్ని ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా సుకుమార్ పెట్కులే మాట్లాడుతూ బహుజన కులాలన్నీ పూలే అడుగుజాడల్లో నడుస్తూ సామాజిక న్యాయంతో పాటు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రధాన్ భాస్కర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, రాష్ట్ర కోశాధికారి సతీష్ గుర్నూలే, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు ఉమేష్‌రావు డోలే, జిల్లా అధ్యక్షులు విజయ్ వాఘ్మరే, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ధనంజయ్ ప్రధాన్, ప్రధాన కార్యదర్శి ఉత్తమ్ వాఘ్మరే, హిందీ డైలీ సీనియర్ ఎడిటర్ సందేశ్ భరద్వాజ్, సావతా పరిషత్ నాందేడ్ జిల్లా అధ్యక్షులు తులసిరామ్ వాఘ్మరే కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన మావల తహసీల్దార్, ఆర్ఐ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మావల మండల కేంద్రంలోని పట్టాపాస్ బుక్‌లో దొర్లిన తప్పులను సరి చేయడం కోసం ఓ వ్యక్తి నుంచి డబ్బులు డిమాండ్ చేసిన మావల తహసీల్దార్ అరీఫా సుల్తానా, ఆర్ఐ హన్మంతరావ్ ఏసీబీకి పట్టుబడ్డారు. జిల్లా కేంద్రానికి చెందిన యతేంద్రనాథ్ యాదవ్ తన 14 ఎకరాల భూమిని నలుగురు పేరు మీద ఉన్న పాస్ బుక్‌లలో దొర్లిన తప్పులను సరి చేయుటలో ధరణిలో ఆన్‌లైన్ చేసుకున్నారు. కాగా ఈ విషయమై పలుమార్లు ఆయన తహసీల్దార్‌ను సంప్రదించారు. అయితే వారు రూ.2లక్షలు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. పక్క ప్రణాళిక మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అదుపులోకి తీసుకొని వివరాలు వెల్లడించారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని రాజురాలో శనివారం నాడు బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్‌పై కొందరు గిట్టని వారు దాడి చేయడం హేయమైన చర్యని బీఆర్ఎస్ నాయకులు కనక తుకారాం అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాన్సన్ నాయక్ రాజకీయ ఎదుగుదల ఓర్వలేక చిన్న చిన్న విషయాలపై దాడికి దిగడం పూర్తిగా ఖండిస్తున్నామని అన్నారు. ఆయనపై దాడిచేసిన ఎంతటి వారైనా ఉపేక్షించేదలేదని స్పష్టం చేశారు. ఈ సంఘటనకు కారణమైన మాజీ ఎంపీటీసీతో పాటు ఆయన అనుచరులపై ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జాన్సన్ నాయక్‌కు బీఆర్ఎస్ టికెట్ ఖరారు కావడంతో అది జీర్ణించుకోలేక ఇలా గొడవలు సృష్టించడం పిరికి మాలిన చర్యగా భావిస్తున్నా మన్నారు. జాన్సన్ నాయక్‌కు గిట్టని వారు రాజకీయంగా ఎన్ని కుట్రలు చేసినా భయ పడేది లేదని పేర్కొన్నారు. వారికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాదవ్ లఖన్, ప్రకాష్, రాథోడ్ పరశురాం నాయక్, ఆరెల్లి రాందాస్ పాల్గొన్నారు.

27న ఖోఖో బాలికల జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 27న ఉట్నూరులోని పూలాజి బాబా పాఠశాలలో 14 సంవత్సరాల విభాగం జిల్లాస్థాయి బాలికల ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన క్రీడాకారులు సంబంధిత వయసు ధృవీకరణ పత్రంతో హాజరు కావాలని తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున బాలికలు హాజరయ్యేలా చూడాలని వ్యాయామ ఉపాధ్యాయులను ఆయన కోరారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం10 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-తలమడుగు

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాదేవి అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ సభ్యులు చట్టాల గురించి పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. దళిత, గిరిజనుల విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు. కాగా తను రెండోసారి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలుగా నియమించినందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం నీలాదేవిని ఆమె స్వగృహంలో కలిసి శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు గడుగు పొచ్చన్న, నిమ్మల గజానంద్, బొండ్ల రమేష్ పాల్గొన్నారు.

గొప్ప అవార్డు ఉదారి నాగదాసు స్మారక సాహిత్య పురస్కారం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలుగు సాహిత్యంలో గొప్ప అవార్డు ఉదారి నాగదాసు స్మారక పురస్కారమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జగ్‌రామ్ అంతర్వేది అన్నారు. ఆదివారం జెడ్పీ సమావేశమందిరంలో ప్రముఖ తత్వకవి ఉదారి నాగదాసు స్మారక సాహిత్య పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు కవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఉదారి నాగదాసు స్మారక పురస్కారాన్ని అందుకున్న కవులు తెలుగు సాహిత్యంలో చాలా గొప్ప కవులని అన్నారు. ఈ అవార్డులతో కవికి మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు. నాగదాసు భావాలు లౌకికత్వంలో ఉన్నాయని నాకు అవార్డు రావడం చాలా సంతోషంగా గర్వంగా ఫీలవుతున్నానని అవార్డు గ్రహీత ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు, విమర్శకులు సామల వీరన్న, డా.రూప్ కుమార్ డబ్బీకార్, సామల రాజవర్ధన్, మధుసూదన్‌రావు, నిర్వాహకులు డా.ఉదారి నారాయణ, ఉదారి కృష్ణమాచార్యులు, ఉదారి దయానంద్, ఉదారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనోత్సవ వేడుకలు

- ఏఎస్పీ ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు

నవతెలంగాణ-ముధోల్

నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌తో పాటు మండలంలోని చించాల, చింతకుంట తండా, రాంటెక్, తదితర గ్రామాల్లో ఆదివారం గణనాథుల నిమజ్జనోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఏడురోజుల పాటు వివిధ మండపాలలో భక్తిశ్రద్ధలతో బొజ్జగణపయ్యలను పూజించారు. నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గణనాథులను ప్రతిష్ఠించి గ్రామాలలోని ప్రధాన వీధుల గుండా శోభయాత్రను నిర్వహించారు. ముధోల్, భైంసా అడిషనల్ ఎస్పీ కాంతిలాల్ పాటిల్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అనంతరం ముధోల్‌లోని గణనాథుల శోభాయాత్ర వెళ్లే మార్గాలను పరిశీలించి, సీఐ వినోద్‌రెడ్డి ఎస్సై సాయికిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సలహాలు సూచనలను ఇచ్చారు. గణనాథుల నిమజ్జనోత్సవం సందర్భంగా భక్తులు ప్రజలు భక్తి గీతాలు ఆలపిస్తూ కోలాటలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా చేపట్టారు.

లడ్డు వేలం పాట...

మండల కేంద్రమైన ముధోల్‌తో పాటు ఆయా గ్రామాల్లో గణేష్ లడ్డూ వేలంపాటను నిర్వహించారు. అలాగే భక్తులు లడ్డు దక్కించుకునేందుకు వేలం పాటలో పోటాపోటీగా పాల్గొన్నారు. ముధోల్‌లోని కొలిగల్లీలో ముదిరాజ్ గణపతి లడ్డును బీజేపీ మండల నాయకులు కోరి పోతన్న వేలం పాటలో పాల్గొని రూ.19వేలకు దక్కించుకున్నాడు.

గట్టి పోలీసు బందోబస్తు..

నిమజ్జనోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తును నిర్వహించారు. ఈ బందోబస్తులో భైంసా అడిషనల్ ఎస్పీ కాంతిలాల్ పాటిల్ నేతృత్వంలో ఒక ఏఎస్పీ(ఏఆర్), 10మంది ఎస్సైలు, 8మంది సీఐలు, 180 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు.

బాసర : మండల కేంద్రంలోని మైలాపూర్ గ్రామంలో ఆదివారం సార్వజనిక గణేశుని నిమజ్జన శోభాయాత్రను ఎస్సై గణేష్, కమిటీ సభ్యులు ప్రత్యేకపూజలు చేసి ప్రారంభించారు. ఏడు రోజులుగా సార్వజనిక గణేశ్ కమిటీ సభ్యులు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై గణేష్ మాట్లాడుతూ పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, గ్రామస్తులకు, యువకులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై గణేష్‌ను కమిటీ సభ్యులు గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేష్, వీడీసీ కమిటీ అధ్యక్షుడు నర్సయ్య పాల్గొన్నారు.

నార్నూర్ : మండలంలోని తాడిహత్నూర్‌లో గ్రామంలో ఎస్టీ కాలనీ, శివగణేష్ యూత్ మండలి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకున్ని ఆదివారం ఘనంగా నిమజ్జనం చేశారు. ముందుగా గ్రామపెద్దలు మహిళలు మండలి యూత్ సభ్యులు గణనాథుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, గ్రామపెద్దలు సూరజ్ జాదవ్, కేంద్రే రామ్ కిషన్, జాదవ్ ఉమాజీ, జాదవ్ గోకుల్, పవార్ గణేష్, పాచంగే భీమ్‌రావ్, రవీందర్, జాదవ్ లింబాజీ, రాందాస్, చోలే ఏకనాథ్, జాదవ్ విద్యారాణి, రోహిదాస్, యూత్ మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ముధోల్



నార్నూర్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | సెప్టెంబర్ 25, 2023 | www.navatelangana.com

బీజేపీ జిల్లా కార్యదర్శి నియామకం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



బీజేపీ జిల్లా కార్యదర్శిగా ఆదె నాందేవ్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా గౌత్రె గోపాల్‌లను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆదివారం లేఖలు అందించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతనంగా పార్టీ పదవులు దక్కించుకున్న వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, అధికార ప్రతినిధి లెండుగురె శ్యాంరావు, ఉపాధ్యక్షులు ముత్తు అశోక్, నాయకులు టాకూర్ విజయ్‌సింగ్, దిలీప్, గోపి, లక్ష్మణ్, శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు యువకుల చేరిక

నవతెలంగాణ-మందమర్రి



చెన్నూరు నియోజకవర్గంలోని కోటపల్లి మండలానికి చెందిన పలువురు యువకులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఓదెలు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మారుపాక కమల్ జనగామ పవన్ ఆరె ప్రశాంత్ ఆధ్వర్యంలో యువకులు ఓదెలు నివాసంలో పార్టీ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ నాయకులు నల్లాల ఓదెలు, దుర్గం నరేష్‌లు యువకులకు పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నల్లాల సందీప్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి



నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మాకూరి చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీలు, ఆయాలు చేస్తున్న సమ్మె 14వ రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 48 సంవత్సరాల నుండి ఐసీడీఎస్‌లో తెలంగాణ రాష్ట్రంలో 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు చాలీచాలని వేతనాలు తీసుకుంటూ పేద ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. వీరిని రాష్ట్ర ప్రభుత్వం శ్రమదోపిడికి గురిచేస్తుందని, వీరందరిని శరతులు లేకుండా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు బెదిరింపులు మానుకొని రాష్ట్ర జేఏసీ నాయకత్వాన్ని చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పెన్షన్, ఈఎస్ఐ వర్తింప చేసి ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రాడ్యూటీ అమలుచేయాలని, ఉద్యోగ విరమణ అనంతరం టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.ఐదు లక్షల చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ వయసు 60 ఏండ్లకు పెంచాలని, ప్రమాదబీమా రూ.ఐదు లక్షలు అమలుచేయాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పిల్లలకు రూ.ఐదు, గర్భిణీలు, బాలింతలకు రూ.10 చొప్పున ఆరోగ్యలక్ష్మీ మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంధ్యారాణి, స్వర్ణలత, రుక్మిణి, బాలమ్మ, తిరుపతమ్మ, ప్రమీళ, పద్మ, తారా, శంకరమ్మతో పాటు అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆయాలు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ మహాసభలు విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అక్టోబర్ 1,2 తేదీల్లో కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించే డీవైఎఫ్ఐ మూడో మహాసభలు విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ కోరారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో మహాసభల కరపత్రాలను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని, కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను మరుగున పడేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే పంథాను కొనసాగిస్తుందన్నారు. నిరుద్యోగ సమస్యలపై మహాసభల్లో పూర్తిస్థాయిలో చర్చించడం జరుగుతుందని, సభలకు రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ హాజరవుతారన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకురి సతీష్, చాపిడీ పురుషోత్తం, దుర్గం నిఖిల్, జిల్లా సహాయ కార్యదర్శులు దుర్గం రాజ్‌కుమార్, గెడం టీకానంద్, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపెల్లి రాజేశ్వర్, శ్రావణి, మండల కార్యదర్శి మసాడే పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరతపై అధికారులు చర్యలు తీసుకోవాలి

- సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు పట్టింపు లేని తనంతో వ్యాపారస్తులు ఇష్ట రాజ్యాంగ ఎరువులు అమ్ముతున్నారన్నారు. ఎరువుల కొరత సృష్టించి రైతులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కొంతమంది రైతులు వారి ఆవేదన తమ దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు వ్యాపారులకు సహకరిస్తున్నట్లు రైతులు వివరించారన్నారు. ఇదే నిజమైతే రైతులకు అండగా పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. వ్యవసాయ అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించి అధిక ధరలకు అమ్ముతున్న వ్యాపారులపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తిక్, దుర్గం రాజ్ కుమార్ పాల్గొన్నారు.

లారీ అసోషియేషన్ సమ్మె విరమణ

- అర్ధరాత్రి వరకు కొనసాగిన చర్చలు సఫలం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు యాజమాన్యానికి, లారీ అసోషియేషన్‌కు మధ్య నెలకొన్న వివాదం ఎట్టకేలకు సద్దుమణిగింది. శనివారం సాయంత్రం డీఎస్పీ కరుణాకర్, సీఐ బుద్దె స్వామి సమక్షంలో లారీ అసోషియేషన్ అధ్యక్షులు వి కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి నిజాముద్దీన్, కోశాధికారి ఖయ్యూం, మాజీ కార్యదర్శి తాజుద్దీన్, ఉపాధ్యక్షులు షమా, ఎస్పీఎం ప్రతినిధులు ఎకె మిశ్రా, సురేంద్ర బేహెని, ఎంఎస్ గిరి, రమేశ్‌రావులు చర్చలు జరిపారు. అర్ధరాత్రి వరకు జరిపిన చర్చలు ఒక కొలిక్కి రావడంతో లారీ అసోషియేషన్ నాయకులు సమ్మె విరమించడానికి అంగీకరించారు. తమ డిమాండ్ల పరిష్కారానికి లారీ అసోషియేషన్ ఈ నెల 20 నుండి సమ్మె చేస్తున్న విషయం తెల్సిందే. జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కాడే స్వయంగా జోక్యం చేసుకొని వీరిద్దరి మధ్య వివాదాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నించినా సఫలం కాలేదు. దీనితో లారీ అసోషియేషన్ సమ్మెకు వెళ్లడం అనివార్యంగా మారింది. ఆ రోజు నుండి ప్రతీ రోజు పోలీసు శాఖ సమక్షంలో ఇరువర్గాల మధ్య చర్చలు జరుగుతున్నా సఫలం కాలేదు. ఒకపక్క లారీ అసోషియేషన్‌కు తెలంగాణ రాష్ట్రంలోని లారీ అసోషియేషన్‌లే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని లారీ అసోషియేషన్‌లు కూడా సంఘీభావం ప్రకటించి ఎస్పీఎంకు ముడిసరుకు సరఫరా చేసే లారీలను కూడా నిలిపివేశారు. దీనితో మిల్లులో ఉత్పత్తి నిల్వలు పేరుకుపోగా, ముడిసరుకు రాక నిలిచిపోయింది. దీనితో తప్పనిసరిగా మిల్లు యాజమాన్యం లారీ అసోషియేషన్ డిమాండ్లకు తలొగ్గక తప్పని పరిస్థితి ఏర్పడింది.

అంగీకరించిన డిమాండ్లలో కొన్ని ఇవే

ఎస్పీఎం యాజమాన్యం అంగీకరించిన తమ డిమాండ్లను ఆదివారం లారీ అసోషియేషన్ నాయకులు విలేకరుల సమావేశంలో వివరించారు. గతంలో ఎస్పీఎం యాజమాన్యం స్థానిక లారీల ద్వారా కేవలం 12 పాయింట్లకే పేపర్ ఉత్పత్తులను రవాణా చేసేది. ఇపుడు అదనంగా రెండు పాయింట్లు (అహ్మదాబాద్, రాయపూర్) కేటాయించింది. దీనితో స్థానిక లారీ అసోషియేషన్‌కు నెలకు వంద ట్రిప్పులు అదనంగా లాభం చేకూరింది. 30 శాతం రేట్లు పెంచాలనే లారీ అసోషియేషన్ డిమాండ్‌కు సానుకూలంగా స్పందించిన యాజమాన్యం పది రోజులు గడువు కావాలని, ఈ లోగా జేఏసీ ఏర్పాటు చేసి ఇతర పేపర్ పరిశ్రమలు, లారీ అసోషియేషన్‌లను సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. మిల్లు లోపలికి పోయిన లారీలకు వెంటనే లోడింగ్ ఇవ్వకుండా రోజుల తరబడి ఆపి చివరికి లోడింగ్ ఇవ్వకుండానే తిరిగి పంపిస్తున్నారని, అదే జరిగితే ఒక లారీకి రోజుకు రూ. 2.500 చెల్లించాలనే డిమాండ్‌కు యాజమాన్యం అంగీకరించింది. డ్రైవర్లకు, క్లీనర్లకు రెస్టరూం ఏర్పాటు చేయలనే డిమాండ్‌తో పాటు ఇతర డిమాండ్లకు కూడా యాజమాన్యం అంగీకారం తెలిపిందని అసోషియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో లారీ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఐటీ మాఫీ, డీపీఈ సమస్యపై స్పందించాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కార్మిక క్షేత్రంలో మమ్మల్ని గెలిపిస్తే ఆదాయ పన్ను రద్దు చేస్తామని చెప్పిన రాజకీయ నాయకులు, గెలిచిన కొల్బెల్ట్ ఏరియా ఎంపీ, ఎమ్మెల్యేలు ఐటీ మాఫీ, డీపీఈ సమస్యలపై స్పందించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు మండిపడ్డారు. ఆదివారం పట్టణంలోని స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. లాభాలు ప్రకటించి రెండు నెలలు గడుస్తున్న వాటా చెల్లింపు తేదీని ప్రకటించకుండా ఊరించడం సరికాదని వెంటనే చెల్లింపు తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 11వ వేతనం ఒప్పందం కోర్టు కొట్టి వేసి డీపీఈని వివరణ అడిగి దాదాపు 3 లక్షల మంది బొగ్గు గని కార్మికుల పట్ల ఏ ఒక్క ప్రజాప్రతినిధి ఇప్పటివరకు రాష్ట్రంలో కేంద్రంలో స్పందించకపోవడం విచారకరమన్నారు. అక్టోబర్ 5,6,7న సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి డీపీఈ బోర్డుతో 11వ వేతన ఒప్పందానికి అనుమతులు సడలింపులకై కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు ఎస్.వెంకట స్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్, ఆర్గనైజర్ భేతి భరత్, కలవల శ్రీనివాస్, ఎస్.శ్రీధర్, ఎల్.రమేష్, దొండ నవీన్, ఏ. రాజ్ కుమార్ పాల్గొన్నారు.

పీఆర్టీయూతోనే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం

- ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి
- సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వడ్డేపల్లి గార్డెన్‌లో జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు తమ సంఘంతోనే సాధ్యమైందని గుర్తు చేశారు. మల్టీజోన్ 1 లో 995 మంది పీజీహెచ్ఎం పదోన్నతులు పొందుతున్నారని, వేలాదిమంది ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్‌గా పొందుతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వంపై సంఘం తరపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో పెండింగ్ ట్రెజరీ బిల్లులు కూడా మంజూరు కానున్నాయని తెలిపారు. కేజీబీవీ, ఐఈఆర్‌టి ఉపాధ్యాయులకు కూడా ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ వస్తుందని తెలిపారు. 317 జీవో ద్వారా అనేకమంది ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని, వచ్చే మార్చి తర్వాత వారిని సొంత జిల్లాలకు పంపే ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రభుత్వం కూడా సూచనప్రాయంగా అంగీకరించిందన్నారు. ఈహెచ్ఎస్‌లో ఆదర్శ పాఠశాల హెల్త్ కార్డుల కూడా మంజూరు అవుతాయని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎప్పటినుండో ఎదురుచూస్తున్న పీఆర్సీ పెండింగ్ డీఏలకు సంబంధించి శుభవార్త కూడా ఎన్నికల కంటే ముందే ప్రకటించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు తెలిపారు. అనంతరం సమావేశంలో పలు తీర్మానాలను జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాష్ చదివి వినిపించి నివేదికను ప్రవేశపెట్టి తీర్మానాలను ఆమోదింప చేశారు. జిల్లా నుండి ఇతర జిల్లాకు బదిలీ అయిన మండల విద్యాధికారులు బిక్షపతి, వెంకటేశ్వర స్వామి, భాను కుమార్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో వేణుగోపాలరావు, సాంబశివరావు, ప్రకాష్, బిక్షపతి, ఉదయబాబు, రాజకమలాకర్‌రెడ్డి, చైతన్యకుమార్, శంకర్, గోవింద్, సత్యనారాయణ, శ్రవణ్ కుమార్, రాజు, గణపతి, భరత్ రావు, లెవన్ కుమార్, రాకేష్, రమేష్, సంతోష్, జాడి దేవాజి, పురుషోత్తం, కొయ్యాడ శ్రీనివాస్, కుమురయ్య, గుండు యాదగిరి, మౌల్కర్ సుభాష్, రౌతు రవి, రామారావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఫారెస్టు నర్సరీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్



నవతెలంగాణ-రెబ్బెన

కుమురంభీం జిల్లాలోని ఫారెస్టు నర్సరీలో పనిచేస్తున్న కూలీలకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ ఫారెస్టు నర్సరీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) కుమురంభీం జిల్లా సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన మండలకేంద్రంలోని సాయి విద్యాలయం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 10 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ నర్సరీలోని మొక్కలను కాపాడేందుకు కూలీలు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో డీఎఫ్ఓ కార్యాలయాన్ని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే నర్సరీ కార్మికులకు కనీస వేతనం ప్రతి రోజు కూలీ రూ.600 చెల్లించాలన్నారు. గత మూడు సంవత్సరాల క్రితం రేపల్లెవాడలో పనిచేసిన నర్సరీ కార్మికులకు సుమారు రూ.మూడు లక్షల వేతనాలు ఇవ్వాలని, వారం రోజుల్లోగా చెల్లించాలని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. అలాగే నర్సరీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మాకూరి చిరంజీవి, తెలంగాణ నర్సరీ ఫారెస్టు కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ప్రధాన కార్యదర్శి సంఘమిత్ర, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్, సుధాకర్, సహాయ కార్యదర్శి కవిత, కోశాధికారి సుజాత, నాయకులు కౌసల్య, శంకరమ్మ, మాయ, పద్మ పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష రద్దు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం



నవతెలంగాణ-కెరమెరి

గ్రూప్-1 పరీక్ష రద్దు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూప్-1 పరీక్ష నిర్వాహణలో టీఎస్‌పీఎస్సీ నిర్వహణ బాధ్యతలను సక్రమంగా చేపట్టకపోవడంతో లీకేజీల పర్వం కొనసాగుతుందన్నారు. మొదటిసారి లీకేజ్, రెండవ సారి నిర్వహించిన పరీక్షల్లోనూ అదనంగా ఓఎంఆర్ షీట్స్ వచ్చాయని గ్రూప్-1 అభ్యర్థులు హైకోర్టుని సంప్రదించారన్నారు. గ్రూప్-1 పరీక్ష లీకేజీ అనంతరం ప్రభుత్వం, టీపీఎస్సీ ఎలాంటి జాగ్రత్తలు చేపట్టకపోవడం విడ్డూరమన్నారు. పరీక్షపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నయన్నారు. టీఎస్‌పీఎస్సీ కమిషన్ బోర్డుపైన నిరుద్యోగులకు విశ్వసనీయత లేదన్నారు. ఈ పదేళ్ల కాలంలో వచ్చిన ఒకే ఒక్క గ్రూప-1 నోటిఫికేషన్‌తో నిరుద్యోగులు రూ.లక్షల వెచ్చించి సన్నద్ధమయ్యారని తెలిపారు. పరీక్ష నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన బోర్డ్ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కేసులో ఉన్న బాధ్యులను విధులు నుంచి పూర్తిగా తొలగిస్తు భవిష్యత్తులో నిర్వహించే పరీక్షల్లో అక్రమాలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. నష్టపోయిన అభ్యర్థులకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాంచందర్, మండల నాయకులు భీంరావ్, శేఖర్, ఆకాష్, వేణు, సంజు, అఖిల్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు రాష్ట్ర ప్రభుత్వ, టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యానికి నిదర్శనమని, దీనికి బాధ్యతగా టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడె భీమేష్ డిమాండ్ చేశారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దుకు బాధ్యత వహిస్తూ, బాధ్యులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో గ్రూప్-1 బాధితులతో కలిసి ఆదివారం స్థానిక అంబేద్కర్ చౌక్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తుమ్మిడె భీమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ వల్లే ఈ తప్పిదాలు జరుగుతున్నాయని అన్నారు. టీఎస్‌పీఎస్-సీ ఛైర్మన్‌ను, సభ్యులను తొలగించి కొత్త వారిని నియమించాలని, నష్టపోయిన అభ్యర్థులకు రూ. లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాయికృష్ణ, సహాయ కార్యదర్శి దిగిడ ప్రకాష్, గ్రూప్-1 అభ్యర్థులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంలో గ్రూప్-1 అభ్యర్థుల జీవితాలు అదోగతి పాలవుతున్నాయని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల్కర్ సాయిరాం అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1 నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటుందన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి పరీక్ష కోసం సిద్ధమవుతూ హైదరాబాద్‌లో రూ.వేలాదిగా ఖర్చు చేస్తున్నారని తెలిపారు. అటువంటి అభ్యర్థులకు రెండుసార్లు రాసిన పరీక్ష రద్దు కావడం తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. గ్రూప్-1 పరీక్ష మొదటిసారి రద్దు అయినప్పుడు రెండోసారి పరీక్ష నిర్వహించినప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో అభ్యర్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. ప్రభుత్వం మూడోసారైనా పరీక్ష సరిగ్గా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రామిల్ల మహేష్, రేగుంట వేణు, నాయకులు పోల్కర్ కిషోర్ పాల్గొన్నారు.

చేతిపంపులకు మరమ్మత్తులు



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని పోతపెల్లి గ్రామ పంచాయతీ పరిధిలో మూడు చేతిపంపులు చెడిపోవడంతో సర్పంచ్ చంద్రమౌళి మూడు చేతిపంపులను మరమ్మత్తులు చేయించారు. కాలనీలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

డీసీఎంఎస్ చైర్మన్ పరామర్శా

నవతెలంగాణ-కౌటాల

ఇటీవల అనారోగ్యం కారణంగా ఉమ్మడి ఆదిలాబాద్ డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య కరీంనగర్ అపోలరీస్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని కోలుకొని ఇంటికొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ సిప్పని లింగయ్య డీసీఎంఎస్ పాలకవర్గ సభ్యులు కలిసి ఆదివారం కౌటాలలోని ఆయన స్వగృహంలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని ఆయనకు ధైర్యం చెప్పారు.

మండల కేంద్రంలో ఘనంగా గణపతి హోమం



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద గణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక చవితిని పురస్కరించుకొని నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి మండపం వద్ద వేద పండితులు గణపతి పూజ, హోమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కు భూమేష్, శీలం శేఖర్ ఇతర ఆర్యవైశ్య సంఘ నాయకులు మహిళలు పాల్గొన్నారు

సొంత ఖర్చులతో వంటగదికి మరమ్మత్తులు

నవతెలంగాణ-జైపూర్



ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వంట గదిని స్వంత ఖర్చులతో మరమ్మత్తులు చేపించినట్లు స్థానిక సర్పంచ్ మేడి రవి తెలిపారు. వంట గదిపై కప్పును కోతులు ధ్వంసం చేయడంతో నిర్వాహకుల అభ్యర్థన మేరకు రూ.15 వేలు ఖర్చు చేసి పై కప్పు నిర్మించినట్లు తెలిపారు. అదేవిధంగా వంట గది చుట్టు నిర్మించిన గోడల మరమ్మత్తులతో పాటు ఫ్లోరింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ట్రాక్టర్‌లో ఇటుకల మాటున గంజాయి తరలింపు

● సుమారు 5 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-నస్పూర్



ట్రాక్టర్‌లో ఇటుకల మాటున గంజాయి తరలిస్తున్న ఘటన శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాక్టర్‌తో మంచిర్యాల వైపుకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తుండగా జీఎం ఆఫీస్ దగ్గర జాతీయ రహదారి ప్రక్కన ట్రాక్టర్ బోల్తా పడటంతో గంజాయి విషయం బయటపడింది. గంజాయి సుమారు 5 క్వింటాళ్ల వరకు ఉంటుందని అంచనా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ట్రాక్టర్‌ను శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తొందర్లోనే పూర్తి వివరాలు తెలియజేస్తామని శ్రీరాంపూర్ ఎస్సై రాజేష్ తెలిపారు.

రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

● పీసీసీ సభ్యులు నూకల రమేష్



నవతెలంగాణ-మందమర్రి

రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌ను రాబోవు ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించి అధికారంలోకి తీసుకురావాలని నూకల రమేష్ నియోజకవర్గ ప్రజల్ని కోరారు. మందమర్రి మండలం గుడిపెల్లి గ్రామంలో ఆదివారం మందమర్రి మండల అధ్యక్షుడు బానోత్ నీలయ్య ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ పథకాలు చేర్చే విషయంలో పీసీసీ సభ్యుడు నూకల రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 6 గ్యారెంటీ కార్డులతో ప్రజలకు ముఖ్యంగా మహిళలకు ఉపయోగపడే పథకాలు ఉన్నాయని, ప్రతి మహిళకి రూ.2500, రూ.500 కే గ్యాస్, రైతులకు, ప్రజలకు ఉపయోగపడే ఎన్నో పథకాలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపించి అధికారంలోకి తీసుకు రావాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మరాఠీ శంకర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆకుల అంజి, సిద్ధం జనార్ధన్, సుగునకర్ రావు, శంకర్, బాలయ్య, రాజయ్య, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ రెవెల్లి శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

● పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి



నవతెలంగాణ-కోటపల్లి

ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కావిరీ రవీందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి జ్వరాలతో బాధపడుతున్న వ్యక్తులను పరామర్శించారు. మండలంలోని గ్రామాలలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను వైద్యులకు వివరించి రోగుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు పేద ప్రజలే వస్తారని పేద వారికి సరైన వైద్యం అందించాలని అన్నారు. మండలంలో ఏ గ్రామాలలో చూసిన ఇంటికి ఒక్కరికి జ్వరంతో బాధడుతున్న రని ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్యం అందించాలని అన్నారు. అనంతరం శేట్‌పల్లి గ్రామంలో ఇంటింటికీ తిరిగి విష జ్వరాలతో బాధపడుతున్న వారిని పరామర్శించారు.

డిస్పెన్సరీని తనిఖీ చేసిన డైరెక్టర్, జీఎం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-8 డిస్పెన్సరీని సింగరేణి ఫైనాన్స్ డైరెక్టర్ బలరాం, శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డితో కలిసి ఆదివారం తనిఖీ చేశారు. ఆర్కే-8 డిస్పెన్సరీలో ఉన్న ఫిజియోథెరపీ యూనిట్‌ను పరిశీలించి, ఉద్యోగులకు అందిస్తున్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిస్పెన్సరీలకు కావాల్సిన సదుపాయాలు సింగరేణి సంస్థ కల్పించడంలో ముందు ఉంటుందని గుర్తు చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ బాధ్యత వైద్యులపై ఉందని, ఉద్యోగులకు వైద్య సదుపాయాలను అందించాలన్నారు. అస్పత్రిలో సదుపాయాలు చూసి డైరెక్టర్ కార్పొరేట్‌ల ఉందని అభినందించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి జీఎం రవి ప్రసాద్, ఎస్ఓ టూ జీఎం కె రఘు కుమార్, ఫైనాన్స్ ఏజీఎం మురళీధర్, డీవై సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, ఆర్కే-5, 6 గ్రూప్ గనుల ఏజెంట్ ఏవీ రెడ్డి, క్వాలిటీ మేనేజర్ కే వెంకటేశ్వర్ రెడ్డి, సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారుల నిర్లక్ష్యంతో గిరిజనుల ఇబ్బందులు



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్, గట్రావ్‌పల్లి, సాలెగూడం, పెద్దపూర్ పెద్దగూడెం, సోనాపూర్, నాయకపు గూడెం తదితర ఆదివాసీ గ్రామాల్లో డెంగ్యూ, విష జ్వరాలు పెరగడానికి వైద్య శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు ఆరోపించారు. ఆదివారం దేవాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జ్వరాలు ప్రబలుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటి వరకు ఆదివాసీ గూడాల్లో ఒక మెడికల్ క్యాంపు కూడా నిర్వహించలేదన్నారు. జ్వరాల సర్వే కూడా సరిగా చేయలేదని, వైద్యాధికారులు ఆదివాసీ ప్రజల ప్రాణాలతో చెలగాటాలు ఆడుకుంటున్నారన్నారు. ఇకనైన ఆదివాసీ గ్రామాల్లో వైద్య శిబిరాలతో పాటు జ్వర సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ, గిరిజన సంఘాల నాయకులు జంగు, పెంద్రం సింగు పాల్గొన్నారు.

దేవాపూర్‌లో కుంకుమ పూజ, హోమం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ హోంస్టోర్ కాలనీలో భజరంగ్‌దళ్ యూత్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కుంకుమ పూజ, హోమం నిర్వహించారు. ఓరియంట్ కాలనీతో పాటు గ్రామ మహిళలు భారీగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఉదయ్ కిరణ్‌రెడ్డి, నిఖిల్ రెడ్డి, బోరె వంశీ, శ్రీనివాస్, మడావి అభినవ్, సంతోష్, చరణ్ రావు పాల్గొన్నారు.

యూరియా ఏదయా..!

- వర్షాలకు తప్పనిసరవుతున్న వినియోగం
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- బస్తా రూ.350 వరకు అమ్ముతున్న వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు

గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పత్తి, వరి పంటలు చివరి దశలో యూరియా అవసరం పడుతుంది. కాని యురియా అందక రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కూడా యూరియా లేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రయివేట్ డీలర్లు కృత్రిక కొరత సృష్టించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదనుగా కొంత మంది వ్యాపారులు ధరలు ఇష్టానుసారంగా పెంచేసి అమ్ముతుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పటడంలేదు. అధికారులు మాత్రం అసలు యూరియా కొరతే లేదనడంతో ధరలు ఎందుకు పెంచారని రైతులు ప్రశ్నిస్తున్నారు.



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లాలో ఈ వానాకాలం లో రెండు లక్షల ఎకరాల్లో పత్తి పంట,1.60లక్షల ఎకరాల్లో వరి, 13 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతున్నాయి. పత్తి, వరి పంటలు పొట్ట దశలో ఉన్నాయి. ఈ సమయంలో యూరియా, పొటాష్‌లు పంటలకు వేయాల్సి వుంది. దీనికి తోడు ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వీటి వినియోగం ఒక్క సారిగా పెరిగింది. అవసరం మేరకు యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చివరి విడత ఎరువు వేసే సమయం దాటిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు వ్యాపారులు కుమ్మక్కై కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

యూరియా బస్తా రూ.350

జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి 28 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వచ్చిందని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి 40వేల మెట్రిక్ టన్నులకు పైగానే అవసరం ఉంది. కానీ అధికారులు మాత్రం అవసరం మేరకు యూరియా వుందని చెబుతున్నారు. కానీ వాస్తవ పరిస్తితి అందుకు బిన్నంగా వుంది. గత వారం రోజులుగా యూరియా కొరత ఏర్పడింది. రైతుల అవసరాలకు క్యాష్ చేసుకునేందుకు డీలర్లు, ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న ఎరువుల దుకాణాల్లో కృత్రిమ కొరత సృష్టిస్తు రూ.270 వరకు అమ్మాల్సిన ఒక్కో బస్తా రూ .350 వరకు అమ్ముతున్నారు. కొందరు రైతులు చేసేదేమీ లేక అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో యూరియా అవసరాన్ని గుర్తించక పోవడంతో ఈ యూరియా బ్లాక్ దందా నడుస్తోందని విమర్శలు వస్తున్నాయి. ఈ పాస్ మిషన్లలో స్టాక్ రిపోర్ట్ లు సరిగ్గా నమోదు చేయకపోవడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. అధికారులకు యూరియా అవసరంపై ముందస్తు అవగాహన లేకపోవడంతో జిల్లాకు రావాల్సిన వ్యాగన్ ఇతర జిల్లాకు వెళ్లినట్టు సమాచారం.

యూరియా దొరకడం లేదు..

కారుకూరి శ్రీనివాస్, రైతు నమ్నూర్ గ్రామం

నేను 25 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఇప్పుడు చివరి దశ ఎరువు అవసరం ఉంది. పొటాష్, యూరియా కలిపి వేయాల్సి ఉంది. యూరియా కొరకు దుకాణం పోతే రూ.350 అన్నారు. మా అవసరాన్ని అదునుగా భావించిన డీలర్లు ధరలు పెంచడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూరియా అందుబాటులో ఉండేలా చూడాలి.

ఆందోళన అవసరం లేదు

కల్పన. జిల్లా వ్యవసాయాధికారి

జిల్లాలో యూరియా కొరత లేదు. రైతు సహకార సంఘాల ద్వారా యూరియా అన్ని మండలాలకు సరఫరా చేశాము. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎవరైనా అధిక ధరలకు యూరియా అమ్మితే మా దృష్టికి తీసుకురావాలి.

ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలి

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి ● ప్రభుత్వ ఆస్పత్రి సందర్శంచిన నాయకలు



నవతెలంగాణ-హాజీపూర్

ఆస్పత్రిలో సౌకర్యాలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే సౌకర్యాలు కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. ఆదివారం సీపీఐ(ఎం) నాయకులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా సంకె రవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజలందరూ విష జ్వరాల బారిన పడుతున్నారన్నారు. ఎక్కువ మంది ప్రజలు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, రక్త హీనత వంటి అనారోగ్య సమస్యలతో మంచం పడుతున్నారన్నారు. ఈ మధ్యకాలంలో కాసిపేట మండలంలో ఇద్దరు జ్వరంతో మృతిచెందారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకి వైద్యం అందక చనిపోతున్నారన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం కోసం దహెగాం మండలం నుంచి దుర్గం శాంత అనే పేషంట్ గత ఐదు రోజుల కింద ఆస్పత్రికి వచ్చి కడుపునొప్పి అని చెప్పినా కూడా డాక్టర్లు స్కాన్ చేయట్లేదని డాక్టర్లు పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నరన్నారు. ఎల్.రమేష్ అనే వ్యక్తికి రక్త హీనత తగ్గడంతో ఆస్పత్రిలో చేరి నాలుగు రోజులు గడిచినా కానీ డాక్టర్లు మాత్రం టెస్ట్ చేయకుండానే నీకు డెంగ్యూ జ్వరం వచ్చిందని చెప్పారన్నారు. చివరకు టెస్ట్ విషయంలో పట్టించుకోకపోవడంతో బయటకెళ్ళి టెస్ట్ చేయించుకుని రావడం జరిగిందనన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు టెస్ట్ చేసిన రెండు రోజులు దాటితే కానీ రిపోర్ట్‌లు ఇవ్వడం లేదన్నారు. ఆస్పత్రిలో ఉన్న రోగులకు, వారితో వచ్చేటువంటి సహాయకులకు కనీస సౌకర్యాలైన మంచినీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు పూర్తిగా లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రి అంటేనే భయపడుతున్నారన్నారు. డాక్టర్లు కూడా సరైన సమయం పాటించకుండా వారికి ఇష్టమైన సమయానికి వస్తు వెళ్తున్నారన్నారు. జిల్లా ఆస్పత్రి ఇలా ఉంటే మండలాల్లో ఉన్నటువంటి ఆస్పత్రిల పరిస్థితి ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు స్పందించాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస సౌకర్యాల కోసం సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాష్, దాసరి రాజేశ్వరి, దుంపల రంజిత్ కుమార్, దూలం శ్రీనివాస్, కుమారస్వామి, ఆలుగునూరి రజిత, కిషన్‌లు పాల్గొన్నారు.

ఉపరితల గనిలో హరితహారం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా ఉపరితల గని ఆవరణలో ఏరియా ఫైనాన్స్ డైరెక్టర్ బలరాం ఆధ్వర్యంలో ఆదివారం హరితహారం నిర్వహించారు. వృక్ష ప్రేమికుడైన సింగరేణి ఫైనాన్స్ డైరెక్టర్ బలరాం గని ఆవరణలో 550 మొక్కలు నాటించారు. ఇటీవల చట్టసభలలో మహిళా బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా నాటిన మొక్కల ప్రదేశాన్ని ఉమెన్స్ మినీ ఫారెస్ట్‌గా నామకరణం చేశారు. ఇప్పటి వరకు డైరెక్టర్ 17,693 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా మొక్కలను నాటుతూ వాటిని రక్షిస్తూ ముందుకు వెళుదన్నారు. ప్రతి ఒక్కరూ మూడు మొక్కలను నాటాలని, ఉద్యోగులు, అధికారులు అందరూ తమ తమ నివాస ప్రాంతాల్లో పరిసరాలలో వీలైనన్ని మొక్కలను నాటి పరిరక్షించాలన్నారు. వృక్షో రక్షతి రక్షితః అనే నినాదంతో ముందుకు వెళ్లాలని, వాటిని రక్షిస్తే అవి మన భావితరాలకు స్వచ్ఛమైన గాలి అందిస్తాయని తెలిపారు. వీటి ద్వారా జీవకోటి మనుగడ పెరుగుతుందన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ దిశానిర్దేశంలో సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ శ్రీధర్ మార్గదర్శకంలో సింగరేణి సంస్థ నాటిన మొక్కలను పరిరక్షిస్తుందన్నారు. అందులో భాగంగా సింగరేణి వ్యాప్తంగా ఈరోజుతో స్వయంగా 17,690 మొక్కలను నాటడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ సింగరేణి సంస్థలో అత్యున్నత స్థానంలో ఉండి డైరెక్టర్ బలరాం అన్ని ఏరియాలలో మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించేల తీసుకుంటున్న శ్రద్ధ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం రఘు కుమార్, అధికారుల సంఘం నాయకులు ఏవీ రెడ్డి, అబ్దుల్ ఖాదర్, ఫైనాన్స్ ఏజీఎం మురళీధర్, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తమరెడ్డి, ఏజెంట్లు గోపాల్ సింగ్, రాముడు, ఫారెస్ట్ ఆఫీసర్ రమణ రెడ్డి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, గని మేనేజర్ సుధీర్, డీవై సీఎంఓ డాక్టర్ రమేష్ బాబు, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్రశేఖర్, సంక్షేమ అధికారి శంకర్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-జన్నారం

మండలం మందపల్లి గ్రామంలో చీటి సాయిబాబా రెండో కుమారుడు శనివారం అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట, ఎంపీపీ మాదాడి సరోజన, సెత్పల్లు సత్యం గంగయ్య, బాలసాని శ్రీనివాస్ గౌడ్, జక్కుల సురేష్ ఉన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని 16వ వార్డులో ఇటీవల గుండెపోటుతో మరణించిన ఆటో డ్రైవర్ కుమ్మరి సదానందం కుటుంబానికి టీపీసీసీ ఎన్నికల స్ట్రాటజీ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. చిన్న వయసులోనే గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా ఆదుకుంటామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తెనుగు దేవేందర్, చిలుక మల్లేష్ పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న గ్రీన్ వుడ్ పాఠశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్ డిమాండ్ చేసారు. పీడీఎస్‌యూ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డి.శ్రీకాంత్ మాట్లాడుతూ గద్దె రేగడిలో ఉన్న గ్రీన్ వుడ్ పాఠశాల యాజమాన్యం అడ్మిషన్లు నిర్వహించే క్రమంలో విద్యార్థి తల్లిదండ్రులను మభ్యపెడుతూ, మోసం చేస్తూ సీబీఎస్ పేరుతో అడ్మిషన్లు నిర్వహించారాన్నారు. దాని పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ రూ.లక్షలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి తీసుకున్నారన్నారు. దీనిపై శనివారం విద్యార్థుల పేరెంట్స్ స్కూల్ కి వెళ్లి యజమాన్యాన్ని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతూ మాకు సీబీఎస్ సిలబస్ పర్మిషన్ లేదు అని చెప్పడంతో విద్యార్థి తల్లిదండ్రులు గ్రీన్ వుడ్ పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. గ్రీన్ వుడ్ పాఠశాల ఇంత బహిర్గతంగా విద్యను వ్యాపారం చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. స్కూల్ గుర్తింపు రద్దు చేసి, యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి స్పందించి గ్రీన్ వుడ్ పాఠశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పీడీఎస్‌లయూ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

స్వచ్ఛతాపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

తెలంగాణ ప్రభుత్వ ఆదేశాను క్యాతనపల్లి మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమములో భాగంగా ఆదివారం స్థానిక రాజీవ్ చౌక్ నుంచి బి-జోన్ వరకు శుభ్రత కార్యక్రమాన్ని కార్యక్రమము నిర్వహించారు. స్థానిక ప్రజలకు చెత్తను బహిరంగ ప్రదేశాలలో పడవేయొద్దని, బహిరంగ ప్రదేశాలలో మల మూత్ర విసర్జన చేయరాదని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమీషనర్ జి.వెంకట నారాయణ మాట్లాడుతూ మన పరిసర ప్రాంతాలు పరిశుభ్రముగా ఉంచుకోవడంతో అనారోగ్య బారిన పడే అవకాశములు తక్కువగా ఉంటాయని తెలిపారు. చెత్తను బహిరంగ ప్రదేశాలలో పడవేసిన ప్లాస్టిక్ వాడకము, అమ్మడము చేసిన, బహిరంగ ప్రదేశములలో మల మూత్ర విసర్జన చేసిన వారికి భారీ జరిమానా విధించడము జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో వైస్ చైర్మన్ ఏ. విద్యా సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

జ్వరాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

● గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని అన్ని గ్రామాలలో వైరల్ జ్వరాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికరం అశోక్ నాయకులు కే బుచ్చయ్య, ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పోతు విజయ శంకర్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని రాంనగర్, వినాయక్‌నగర్ కాలనీలలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులను ఆమె పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ప్రభుత్వ వైద్యురాలు ఉషాశ్రీతో మాట్లాడి గ్రామాల్లో డెంగి మలేరియా సీజనల్ వ్యాధులు వస్తున్నాయని వాటిని నివారించడానికి అన్ని గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రెండే పడకలు ఉండడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడ్ల రాజన్న, జయ, పాల్గొన్నారు.

ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

నవతెలంగాణ-తాండూర్

రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రెండవసారి గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దుతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు ప్రకటనలో ఆరోపించారు. టీఎస్పీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ప్రశ్నాపత్రాలు అమ్ముకోవడానికి ప్రయత్నించి లక్షలాదిమంది నిరుద్యోగుల జీవితాలను రోడ్డున పడేసిన రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రం పేపర్ లీకేలీలతో, పరీక్షల రద్దులతో మొదటి స్థానంలో నిలిచిందని ఆరోపించారు. టీఎస్పీఎస్సీ ప్రక్షాళన చేయాలని పేపర్ లీకేజికి కారణమైన టీఎస్పీఎస్సీ చైర్మన్, సెక్రటరీలను తొలగించి పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు

ఆర్టీసీ కండక్టర్ హఠాన్మరణం

నవతెలంగాణ-ఉట్నూర్



ఆర్టీసీ కండక్టర్ విధులకు ఇంటి నుంచి వెళ్లిన కొద్ది సేపటికే హఠాన్మరణం చెందిన ఘటన ఆదివారం ఉట్నూర్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... జాడి పోశలింగం(54) వృత్తి రీత్యా ఆర్టీసీ కండక్టర్‌గా ఉట్నూర్ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్నారు. రోజు యదావిధిగా ఆదివారం కూడా విధులకు వెళ్లారు. అక్కడ ఆకస్మాత్తుగా కింద పడిపోయాడు. వెంటనే ఆర్టీసీ సిబ్బందితో పాటుగా కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. అందరితో కలిసి మెలసి ఉండే పోశలింగం మృతి చెందడంతో ఆర్టీసీ ఉద్యోగులు భవోద్వేగానికి లోనయ్యారు. డ్యూటికి వెళ్లోస్తానని చెప్పి పది నిమిషాల కాకముందే ఇలా జరిగిందని, బోరుమని కుటుంబ సభ్యులు విలపించడంతో అందరిని కంటతడి పెట్టించింది. మృతుడికి భార్య గీత, కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

స్వచ్ఛంద రక్తదానానికి యువత ముందుకు రావాలి

ఆదిలాబాద్‌టౌన్ : రక్తదానం చేయడానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని, తద్వారా ఆపదలో ఉన్న బాధితుల ప్రాణాలను కాపాడవచ్చని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం కిరాణా అండ్ జనరల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిమ్స్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన వారిని అభినందించి పండ్ల రసం అందచేశారు. అత్యవసర సమయంల్లో రక్తం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. అలాంటి క్లిష్ట సమయంలో బాధితులకు అండగా నిలబడేలా రక్తదానం చేయాలని సూచించారు. అసోసియేషన్ ద్వారా విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల అభినందనలు తెలియచేశారు. ప్రతి నెల యాభై యూనిట్లకు తగ్గకుండా రక్తదానం చేస్తున్నారని, ఇప్పటివరకు మూడు శిబిరాలను ఏర్పాటు చేశారని అన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుంటూ మరింత మంది ముందుకు వచ్చి రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలనీ సూచించారు. ముఖ్యంగా యువత రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బాధితుల ప్రాణాలు కాపాడే బృహత్ కార్యంలో పాలు పంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, అసోసియేషన్ వ్యవస్థాపకులు దాదాసాహెబ్, గణేష్, రాజేందర్ పాల్గొన్నారు.

మార్పు కోసం యువత ముందుకు రావాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ నియోజకవర్గం గత కొన్నేండ్ల నుండి అభివృద్ధికి నోచుకోక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని, మార్పు కోసం యువత నడుం కట్టాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని చింతకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ ఎంపీటీసీ లావుడె మంగీలాల్ తన అనుచరులతో కలిసి బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికారం దిశగా పార్టీ పనిచేస్తుందని, దీనికి యువత ముందుండాలన్నారు. నేను సైనిక్ స్కూల్ పెడితే ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మద్యం షాపులు పెట్టారనని, ఆయన లాగా దొంగ మాటలు చెప్పనని, అతని అనుచరులు కోట్లు సంపాదించుకోవచ్చు కానీ సామాన్య ప్రజలు అవినీతిని ప్రశ్నిస్తే కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారన్నారు. అందుకే కోనేరు కోనప్ప నాయకులను కోనేటిలో పడేయాలన్నారు. బహుజన పార్టీ పేద ప్రజల బ్రతుకులు మార్చడానికే ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. ప్రతి నిమిషం నియోజకవర్గ మార్పు కోసం పనిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పార్టీలో చేరిన ఎంపీటీసీ లావుడె మంగీలాల్ మాట్లాడుతూ గతంలో చింతకుంట గ్రామ సర్పంచ్‌గా, ప్రస్తుతం ఎంపీసీగా ఉన్నప్పటికీ అధికార బీఆర్ఎస్ ఎలాంటి నిధులు ఇవ్వలేదని, అందుకే పార్టీ నుండి వీడి బీఎస్పీలో చేరానని, గ్రామస్తులు నాకు సహకరిస్తే అభివృద్ధికి తోడ్పడుతానన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిడాం గణపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి హర్షద్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్ కుమార్, మండల అధ్యక్షుడు బొడ్డు రవి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ పటేల్, మైనార్టీ సెల్ నాయకులు షేక్‌చాంద్, యువత పాల్గొన్నారు.



యువతకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



కాగజ్‌నగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా పోరాటం......

కాగజ్‌నగర్‌రూరల్, కౌటాల : బహుజనులకు రాజ్యాధికారమే అంతిమలక్ష్యంగా పోరాటానికి సిద్ధం కావాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం సిర్పూరు (టి) నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ముందుగా కాగజ్‌నగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కాగజ్‌నగర్ మండలంతో పాటు సిర్పూరు(టి), కౌటాల మండలాలలో పర్యటించారు. కాగజ్‌నగర్ మండలంలోని బసంతినగర్ విలేజ్ నెంబర్-3లో ప్రతిష్టించిన వినాయక మండపాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌటాల మండలంలోని పలు గ్రామాలలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఆయా గ్రామాలలో బీఎస్పీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, సంక్షేమ పథకాలకు రాజీ పడకుండా అంతిమ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. టీఎస్‌పీఎస్‌సీ కమిషన్‌ను రద్దు చేసి కొత్త కమీషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ తనకు కావాల్సిన వ్యక్తులు, బంధువులకు గ్రూప్-1 ఉద్యోగాలను అమ్ముకోవడం కోసమే టీఎస్‌పీఎస్‌సీని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. రానున్న ఎన్నికలలో మద్యం, నోట్లు పంచి గెలిచేందుకు అధికార బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని, వీటికి ఆశ పడకుండా బీఎస్పీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అర్షద్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్, మాజీ జడ్పీటీసీ పిల్లల తిరుపతి, నాయకులు విజయ నిర్మల, సిడాం జ్యోతి, నవీన్, మనోహర్, రాంప్రసాద్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

317 జీఓ బాధితుల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

370 ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులు కుటుంబాలతో ప్రగతి భవన్ ఎదుట శాంతియుత ధర్నాకు నిర్వహిస్తున్న వారిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు శాంతికుమారి, ఇందురావు, ఉపాధ్యక్షులు హేమంత్ షిండే, కోశాధికారి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు ఉషన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తమ స్థానికతను కోల్పోయే విధంగా 317 జీఓ ఉందని, దీనిని వెంటనే రద్దు చేసి వారి జిల్లాలకు తిరిగి కేటాయించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన శాంతియుత ధర్నాపై పోలీసుల అరాచకం సృష్టించారన్నారు. బాదితులకు అండగా సంఘం ఉంటుందని, వెంటనే వారి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

భారీ వర్షానికి కూలిన ఇంటి గోడ

నవతెలంగాణ-భీమిని

మండలం కేంద్రంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి కుర్మిండ్ల భీమయ్య ఇంటి గోడ కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గత రెండు రోజులుగా వర్షం భారీగా కురుస్తుండడంతో వర్షపు నీటికి గోడలు తడిసి ఒకేసారి కూలిపోయింది. ఆ సమయంలో ఎవరు లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందనీ బాధితుడు భీమయ్య తెలిపాడు. నిరు పేద కుటుంబానికి చెందిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

పట్టణంలో పట్టపగలే చైన్ స్నాచింగ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో చైన్ స్నాచింగ్ ఘటనలు కలకలం రేపుతున్నాయి. ఇటీవల ఓ ఘటన జరుగగా తాజాగా పట్టపగలే మరొక ఘటన జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఓ వృద్ధురాలు అక్కడే ఆ కాలనీలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్లగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ముఖానికి మాస్క్ పెట్టుకొని ద్విచక్ర వాహనం మీద వచ్చి ఆమె మెడలో ఉన్న నలుగు తులాల బంగారంను లాక్కెళ్లారు. కుటుంటీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గ్రూప్-1 పరీక్షను రద్దు చేసిన హైకోర్టుకు ధన్యవాదాలు



నవతెలంగాణ-జన్నారం

గ్రూప్ వన్ పరీక్షను రద్దుచేసి ప్రజల పక్షాన నిలిచిన హైకోర్టుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని బీఎస్పీ నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జి బన్సీలాల్ రాథోడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణలో ఉన్న 30 లక్షల మంది నిరుద్యోగుల పక్షాన వారికి అండగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గత సవత్సరం నుంచి పోరాడుతున్నారని, నిరుద్యోగుల కోసం ఆమరణ నిరాహారదీక్షను సైతం చేశారని, ప్రభుత్వం దిగి వచ్చి గ్రూప్-2 పరీక్షను రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేసారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతున్న ఏకైక పార్టీ బహుజన సమాజ్ పార్టీ అని అన్నారు. గ్రూప్-1 పరీక్షలను కూడా రద్దు చేయాలని టీఎస్పీఎస్సీ కమిషన్‌ను కూడా పూర్తిగా రద్దు చేసి చైర్మెన్ జనార్ధన్ రెడ్డిని, కమిషన్ సభ్యులను అరెస్ట్ చేయాలని గతంలో మా రాష్ట్ర అధ్యక్షులు ఆరేస్పి డిమాండ్ చేశారని గుర్తు చేశారు. హైకోర్టు తీర్పుతోనైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం సిగ్గు తెచ్చుకొని టీఎస్పీఎస్సీనీ పూర్తీగా రద్దు చేసి కమిషన్‌ను ప్రక్షాళన చేసి, మళ్ళీ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చశారు. నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తక్షణమే రాజీనామ చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర గవర్నర్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కరికారి రాజేష్, జన్నారం మండలం అధ్యక్షులు బుక్య రమేష్, మండల ఉపాధ్యక్షలు రవీందర్, ప్రధాన కార్యదర్శి రఘు వరన్ భీమేష్, సతీష్ పాల్గొన్నారు.

అత్యుత్సాహం ప్రదర్శించొద్దు

నవతెలంగాణ-కౌటాల

రాబోయే వినాయకుల నిమజ్జనంలో యువకులు అత్యుత్సాహం ప్రదర్శించి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని కౌటాల ఎస్సై మధూకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యుత్సాహం ప్రదర్శించి సాంస్కృతిక విన్యాసాల పేరుతో ప్రాణాలకు ముప్పు తెచ్చుకొని వినాయకులకు విఘ్నాలు కలిగించొద్దని, సమన్వయం పాటించి భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన సూచించారు. వినాయక మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వినాయకుడి మండపం వద్ద అన్నదానం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలకేంద్రంలోని కోదండ రామాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆర్యవైశ్య గణేష్ మండలి వద్ద ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గణనాథుడికి 56 రకాల ప్రసాదాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం అర్పించారు. గణేష్ మండలి వద్ద గణపురం బాపూజీ-సుకన్య దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు జూడో ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి జూడో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 14 ,17 విభాగంలో బాల బాలికలకు వివిధ వెయిట్ క్యాటగిరిలలో వేరువేరుగా ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి అర్హత కలిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని క్రీడాకారులు సంబంధిత వయసు ధృవీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 9966684201 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-హాజీపూర్



మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి రాజేశ్వరి, దాగం రాజారాం అన్నారు. ఆదివారం జిల్లా విస్తృత సమావేశం సందర్భంగా పట్టణంలో బాయ్స్ హై స్కూల్ గ్రౌండ్ నుంచి పోలీస్ స్టేషన్ మీదగా బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. వివేకావర్ధిని కళాశాలలో యూనియన్ కార్యదర్శి దాసరి రాజేశ్వరి అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ వారు సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. పెరిగిన వేతనాలు పెండింగ్ ఏరియల్స్‌తో సహా చెల్లించాలన్నారు. గుడ్లు, గ్యాస్‌ను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. కొత్త మెనూకి బడ్జెట్ పెంచాలన్నారు. ప్రమాద పరిహారం రూ.10 లక్షలు చెల్లించాలన్నారు. గుర్తింపు, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ మాట్లాడుతూ రాష్ట్రంలో మంత్రులకు, ఎమ్మెల్యేలకు జీతాలు పెంచిన ప్రభుత్వం కార్మికులకు వేతనలు పెంచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మధ్యాహ్న భోజన కార్మికులకు వర్తింపజేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పిస్తూ, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వెంటనే స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనీ పక్షంలో ఈ నెల 28 నుండి రాష్ట్ర వ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం 17 మందితో కూడిన నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా దాసరి రాజేశ్వరి, దాగం రాజారాం, జిల్లా కోశాధికారిగా సునీత (నస్పూర్), ఉపాధ్యక్షులుగా భీమేష్(వేమనపల్లి), కరిమ(చెన్నూరు),రబియా(లక్షెట్టిపేట), జిల్లా సహాయ కార్యదర్శులుగా జ్యోతి(కోటపల్లి), కళావతి(బెల్లంపల్లి), తిరుపతి(హాజీపూర్), లక్ష్మీ(కన్నెపల్లి), జిల్లా కమిటీ సభ్యులుగా మదనమ్మ(జైపూర్), సరిత(భీమారం), సేపురు లక్ష్మి(జన్నారం), రాణి(నెన్నెల), సాయక్క(కాసిపేట), రెడ్డి మల్లక్క(తాండూర్), సుశీల(భీమిని)లున్నారు. ఈ కార్యక్రమంలో గోమాస ప్రకాష్, దూలం శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు, మహిళ నాయకురాలు రజిత, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ఈనెల 28న జిల్లాకు గ్రేట్ ఖలీ రాక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తిర్పెల్లిలోని మహాలక్ష్మి గణేష్ మండల్‌లో ఏర్పాటు చేసిన గణేశుని నిమజ్జనం వేడుకలను ఈనెల 28న నిర్వహిస్తున్నట్టు ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ అధ్యక్షులు ఆదిత్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిమజ్జనం వేడుకలకు డబ్ల్యూడబ్ల్యూ ఈ ది గ్రేట్ ఖలీ వస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ వేడుకలకు వస్తున్నట్టు తెలిపారు. ది గ్రేట్ ఖలీ ఓ వీడియోను విడుదల చేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్కే కాలనీలో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో నివాసం ఉంటున్న ఆర్టిస్ట్ ద్యావంత్ రమేష్ తన తండ్రి చనిపోవడంతో సొంత గ్రామమైన నేరడిగొండకు వెళ్లారు. అయితే ఒక పని కోసం తన బావను ఇంటికి పంపాడు. తాళం పగులగొట్టి ఉండటం చూసి దొంగతనం అయిందని గ్రహించారు. ఇంటి లోపల బీరువా తెరిచి ఉందని, సామాన్లు చిందర వందరగా వేసి ఉన్నాయి. దీంతో మావల పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. నగదు పోయినట్లు బాధితుడు రమేష్ తెలిపాడు.

రవీంద్రభారతిలో జిల్లావాసి షార్ట్ ఫిల్మ్ ప్రదర్శన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో ఆదిలాబాద్‌కు చెందిన కిరణ్ ఆయన దర్శకత్వం వహించిన గరీబ్ అనే షార్ట్ ఫిల్మ్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆ శాఖ చైర్మెన్ మామడి హరికృష్ణ హాజరై ఆదిలాబాద్ సంస్కృతి, వనరులను గొప్పగా కొనియాడారు. అలాగే ప్రొడ్యూసర్ డా.రవికిరణ్ యాదవ్ ఆదిలాబాద్ గడ్డ మీద పుట్టినందుకు గర్వంగా ఉందన్నారు. అనంతరం ఘనంగా శాలువాతో దర్శకుడుని సత్కారించి చిత్ర బృందం సభ్యులు హరికృష్ణ కుర్మే, యాక్టర్ సతీష్, మోతె జ్ఞానేశ్వర్‌ను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం త్వరలో విడుదల కాబోతున్న రాజు రాజ్యం పోస్టర్‌ను మామిడి హరికృష్ణ, ప్రొడ్యూసర్ డా.రవికిరణ్ యాదవ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రమేష్, కిషన్‌గౌడ్, రత్నాకర్ పాల్గొన్నారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..



నవతెలంగాణ-దస్తురాబాద్

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని నిర్మల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలో కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాలు దోచుకోవడం తప్ప ప్రజలకి చేసింది ఏమి లేదని అన్నారు. పనికిరాని హామీలు ఇస్తూ ఓట్ల కోసమే రాజకీయం చేస్తున్నారని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో అందరం కలిసి పార్టీని గెలిపించుకోవాలని అన్నారు. అనంతరం దస్తురాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో తొలిసారిగా నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా విచ్చేసిన సందర్భంగా సతీష్‌రెడ్డికి ఘనంగా శాలువాతో కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బరుపటి రమేష్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు గుండా నరేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహేందర్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముట్టే రమేష్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎంబడి గోవర్ధన్, నాయకులు లచ్చన్న, పిల్లి రమేష్, శ్రీనివాస్, నరేష్, రాహుల్, శంకర లింగం, శేఖర్, విజయ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్నదానాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వినాయకుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో వినాయక మండపాల వద్ద ప్రత్యక పూజలు, అన్నదానాలు, ప్రత్యక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు జిల్లా కేంద్రంలోని సాయినివాడలోన్డి, టీఆర్ నగర్, పొట్టి శ్రీరాములు చౌక్‌లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బాపునగర్‌లో 121 రకాల ప్రసాదాల మహా నైవేద్యం సమర్పించారు. ప్రసాదాల తయారీలో కాలనీవాసులు స్వచ్ఛందంగా పాల్గొని ప్రత్యక పూజలు నిర్వహించారు. ప్రతిరోజు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రత్యక ఆకర్షణగా నిలుస్తున్న శారద గణేష్ మండలి మరోసారి 121 రకాల ప్రసాదాలతో అందరినీ ఆకట్టుకుంది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి గణేష్‌ను సందర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలి నిర్వాహకులు పుల్లూరి రవి, అశ్విన్, మంగ, శ్రీనివాస్, మహేందర్, ఆనంద్, రజిని, శిరీష, దేవేంద్ర, విజ్ఞత పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని రాస్తారోకో



నవతెలంగాణ-బోథ్

బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బోథ్ రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పొచ్చెర క్రాస్ రోడ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సాధన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు అలసత్వం వీడాలని రెవెన్యూ డివిజన్ ప్రకటించాలని కోరుతూ నిర్మల్, కిన్వట్, అంతర్ రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్థానిక ప్రజా ప్రతినిధులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో అస్తిత్వం, ఆత్మగౌరవం, అభివృద్ధి, నినాదాలతో ఉద్యమాన్ని ప్రారంభించామని అన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. గంట పాటు రాస్తారోకో చేయడం ఇరు వైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

యువత ఆధ్యాత్మిక మార్గాన్ని అలవాటు చేసుకోవాలి

- బీఆర్ఎస్ నాయకులు బద్రే సుభాష్



నవతెలంగాణ-జైనథ్

యువత అధ్యాత్మిక మార్గాన్ని అలవాటు చేసుకొని జీవితం ఆనందమయంగా చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు బద్రే సుభాష్ అన్నారు. ఆదివారం లక్ష్మీపూర్ గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ గణేష్ మండపంలో ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. గణపతి లడ్డు వేలం వేయగా రూ.3వేల 500తో బద్రే రమేష్ దక్కించుకున్నారు. బ్యాండ్ మేలాల మధ్య ఉరేగించి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల కలలను సహకారం చేయాలని పేర్కొన్నారు. అధ్యాత్మిక చింతన వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమలో సర్పంచ్ దాసరి లక్ష్మీ రాములు, ఉపసర్పంచ్ గాజంగుల స్వామి లక్ష్మీ, మాజీ ఎంపీటీసీ హెడావ్ అశోక్, రాధిక, సంతోష్, అడెల్లు, ఏకూరి సంతోష్, యూత్ అధ్యక్షులు దాసరి ప్రభాకర్, మాడవి అశోక్, బాది ఉశన్న, సిడాం గంగన్న, గోపాతి సాయి, గంగాధర్ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా చెస్ పోటీలు

తాండూర్ : మండల కేంద్రంలో రెండురోజులుగా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలు ముగిశాయి. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు అకోబర్‌లో జరిగే జోనల్ స్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబర్చాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పరిమళ, అభినవ సంతోష్, పీడీలు ఆర్బిటాల్ సమ్మయ్య , అజయ్ రాజయ్య, బెల్లం శ్రీను సాగర్, హరీష్, బాలకృష్ణ, శ్రీకాంత్, నేటి రవి, బాబ్లు, పద్మ, వహీదా, వరలక్ష్మి, రాధా, రాణి, మల్లిక తదితరులు పాల్గొన్నారు. జోనల్ స్థాయికి అండర్ -14 బాలుర విభాగంలో బి మయూర్, కైవల్య, రామ్, నిహాల్,, సూర్య తేజ్, విశ్వ సృజన్, ఎం బృహన్ రుషీ, బాలికల విభాగంలో డి శ్రీహర్షిని, పి మేఘన, సిద్సాయి, జి సాన్విక, అండర్ -17 బాలుర విభాగంలో హర్షవర్ధన్ రెడ్డి, విశ్వతేజ, జి గోపి, జి అనుదీప్.అక్షయలు బాలికలవిభాగంలో జై మల్లేశ్వరి, జయ రాజహంస, జి హరిణి, నిహారిక, అనుషలున్నారు.